Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# తలిదండ్రులు తీరు మారాలి



వాసిలి సురేష్
9494615360

తెలంగాణ ఇంటర్ బోర్డు తీరు పలు వివాదాలకు దారితీస్తోంది. మార్కుల మెమోల్లో తప్పులు రావడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మార్కులు తారుమారు అయ్యాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఫెయిల్ అయిన కొందరు విద్యార్థులు ఆత్మహత్య కూడా చేసుకున్నారు. 100లో 2 నుంచి 3 తప్పులున్నాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ మాట్లాడిన తీరుతో బోర్డు నిర్లక్ష్యం అర్థం అవుతున్నది. అర్హత లేనివాళ్లతో పేపర్లు దిద్దించారని అనుమానం వ్యక్తం అవుతున్నది.

పరీక్షల ఫలితాలు వచ్చాయంటే చాలు విద్యార్థుల ఆత్మహత్యలు సర్వసాధారణం విషయమైంది. టార్గెట్లు, ర్యాంకులు సాధించలేదని పాఠశాల, కళాశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు తిడతారేమోననే భయంతో, పరీక్షల్లో ఫెయిల్ అయితే బంధువులు, చుట్టుపక్కలవారి ముందు చులకన అయిపోతామేమోననే భావనతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మానసిక ఆందోళనే ఆత్మహత్యకు కారణమని నిపుణులు చెబుతున్నారు. అటు తల్లితండ్రులు కూడా పిల్లలు మంచి మార్కులు, ర్యాంకులు సంపాదించాలనే తపన పడుతున్నారే తప్ప వారిలో కలుగుతున్న భరించలేని ఒత్తిడిని పట్టించుకోవడం లేదు. పదో తరగతి పాస్ అయిన తర్వాత కాలేజీ బాట పట్టిన విద్యార్థులు కొత్త ఆశలతో కొత్త ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు. అప్పటి వరకు పాఠశాల జీవితానికి అలవాటుపడ్డ వారికి కాలేజీ వాతావరణం ఓ కొత్త అనుభూతిని తెచ్చిపెడుతుంది. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. మారిన సమాజంలో కార్పొరేట్ విద్యకు అలవాటుపడ్డ తల్లిదండ్రులు పిల్లల్ని ఏ కళాశాలలో చేర్పించాలి, ఎక్కడ ర్యాంకులు ఎక్కువగా వస్తున్నాయి వంటి ఆలోచనల్లోనే మునిగిపోతున్నారు. పిల్లలకు మంచి విద్యను అందించాలన్న తపనలోపడి పేరున్న పెద్ద కాలేజీల ముందు క్యూ కడుతున్నారు. అయితే ఆయా కళాశాలల్లో బోధనా పద్ధతులు, అక్కడి వాతావరణం గురించి చాలా మంది తల్లిదండ్రులు ఆలోచించడం లేదు.




కాలేజీలో చదువు ఒత్తిడి ఓవైపు, తల్లిదండ్రుల ఆలోచనల మేరకు ర్యాంకులు తెచ్చుకుంటామో లేదో అన్న ఆలోచనలు మరోవైపు ఇలా విద్యార్థులు నలిగిపోతున్నారు. పదోతరగతి వరకు లేలేత మనసులపై లేని మానసిక ఒత్తిడి కాలేజీకి రాగానే ఒక్కసారిగా చుట్టుముడుతుండటం వల్ల తెలియని ఆందోళన, భయం నిత్యం వారిని వెంటాడుతోంది. ర్యాంకులు సాధించాలనే తపనో లేక నిర్బంధ విద్యనో తెలియదు కానీ, వారిని పరిస్థితులు ఆత్మహత్యలకు ఉసిగొలిపేలా తయారవుతున్నాయి. తల్లితండ్రులకు కడుపుకోత మిగులుతోంది.

అసంఖ్యాకంగా ఇంటర్ మీడియట్ కార్పొరేట్ కళాశాలలున్నాయి. వాటిలో 80 శాతం కళాశాలలు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన రాజకీయ నాయకులవే కావడం గమనార్హం. ఓ కళాశాల ఏర్పాటు చేయాలంటే విశాలమైన భవనం, క్లాసు గదులు, క్రీడా మైదానం, లైబ్రరీ తదితర వసతులతో కూడిన సౌకర్యాలుండాలి. అయితే అందుకు భిన్నంగా అపార్ట్ మెంట్లు ఇరుకైన భవనాల్లో ఇంటర్ కళాశాలలు వెలుస్తున్నాయి. డబ్బుపై వ్యామోహమే తప్ప విద్యార్థుల గురించి కళాశాల యాజమాన్యాలు ఆలోచించడం లేదు.




పేద పిల్లలు చదువులో ఫెయిలయినా లేదా మార్కులు తగ్గినా ఆత్మహత్య చేసుకోవటం లేదు. ప్రభుత్వ బడిలో చదివే పిల్లలు ఎవరూ ఆత్మహత్య చేసుకోవటం లేదు. ఆత్మహత్య చేసుకొనే వారిలో అధిక శాతం ఇంగ్లీషు మీడియంలో చదివే పిల్లలే. ఆత్మహత్యలు చేసుకొనే వారిలో ఎక్కువ భాగం ప్రయివేటు లేదా కార్పొరేటు బడుల విద్యార్థులే అయివుండటం గమనించవచ్చు. ఎక్కువ భాగం ఆత్మహత్యలు చేసుకొనే విద్యార్థుల ఐఐటి లేదా నీట్ కోసం చదివే వారే కావడం గమనార్హం. ఆర్ట్స్ గ్రూపు చదివే పిల్లలు దాదాపు ఆత్మహత్యలకు పాల్పడటం లేదు.

తెలుగు రాష్ట్రాలలో విద్య ఓ వ్యాపారంగా సాగుతోంది. కళాశాలల యాజమాన్యాలు తల్లిదండ్రుల నుంచి అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్నాయే తప్ప విద్యార్థుల బాగోగులు పట్టించుకోవడం లేదు. ఇరుకైన భవనాలు ర్యాంకుల ఒత్తిడే విద్యార్థులను ఆత్మహత్యల వైపు అడుగులేయిస్తున్నాయని నిపుణులంటున్నారు. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు పుస్తకం తప్ప మరో ధ్యాస లేకపోవడం విద్యార్థులను అసౌకర్యానికి గురి చేస్తున్నది. చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలను అలవాటు చేస్తే చాలావరకు వారి ఆలోచనలు మారే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. పేద పిల్లలు చదువులో ఫెయిలయినా లేదా మార్కులు తగ్గినా ఆత్మహత్య చేసుకోవటం లేదు. ప్రభుత్వ బడిలో చదివే పిల్లలు ఎవరూ ఆత్మహత్య చేసుకోవటం లేదు. ఆత్మహత్య చేసుకొనే వారిలో అధిక శాతం ఇంగ్లీషు మీడియంలో చదివే పిల్లలే. ఆత్మహత్యలు చేసుకొనే వారిలో ఎక్కువ భాగం ప్రయివేటు లేదా కార్పొరేటు బడుల విద్యార్థులే అయివుండటం గమనించవచ్చు. ఎక్కువ భాగం ఆత్మహత్యలు చేసుకొనే విద్యార్థుల ఐఐటి లేదా నీట్ కోసం చదివే వారే కావడం గమనార్హం. ఆర్ట్స్ గ్రూపు చదివే పిల్లలు దాదాపు ఆత్మహత్యలకు పాల్పడటం లేదు. పిల్లలు ఏ గ్రూపులో చేరాలి, ఎక్కడ చదవాలి, చదివి ఏమి (ఐఐటి లేదా మెడికల్) సాధించాలి, అనేవి నిర్ణయించడంలో తల్లిదండ్రులే కీలకంగా వ్యవరిస్తూ విద్యార్థుల ఆసక్తులకు, వారి శక్తి సామర్థ్యాలకు, వారి సొంత నిర్ణయాలకు ప్రాముఖ్యత ఇవ్వడం లేదు. ఐఐటి లేదా మెడికల్ తప్ప మిగతావి ఏవీ చదువులు కావని పిల్లలకు బ్రెయిన్ వాష్ చేస్తున్నది తల్లిదండ్రులే కదా. నేరుగా చెప్పక పోయినా చదువే జీవితం, సీటు పొందటమే ధ్యేయం అనే విధంగా తల్లిదండ్రుల ప్రవర్తన ఉంటున్నది. ఫెయిల్యూర్ సాధారణ అంశం అనే సంగతిని పొరపాటున కూడా పిల్లల బుర్రలోకి ఎక్కనీయకుండా అడ్డుకుంటున్నది తల్లిదండ్రులే. ఇలాంటి తల్లిదండ్రుల ఆలోచనలే మొత్తం సమాజపు ఆలోచనలుగా చెలామణిలో ఉండి, అదే సామాజిక అనుసరణగా నేడు నడుస్తున్నది.